# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎదురుకాల్పులు.. ముగ్గురు మావోలు మృతి

హైదరాబాద్ , అక్టోబర్ 25: తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సోమవారం ఉదయం భీకరమైన ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. పోలీసు బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన తెలంగాణలోని ములుగు జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ సరిహద్దులో చోటు చేసుకుంది.

తెలంగాణ పోలీస్, గ్రే హౌండ్స్ దళాలు కలిసి కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బీజాపూర్, ములుగు సరిహద్దులోని తర్లగూడ వద్ద మావోయిస్టులు పోలీసులకు తారసపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఎస్ఎల్ఆర్, ఏకే-47 రైఫిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


హైదరాబాద్ | మంగళవారం 26-10-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక:77 | పేజీలు:4 | వెల: రూ.1/-


# కేంద్ర ఎన్నికల సంఘంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగ్రహం






హైదరాబాద్ , అక్టోబర్ 25:కేంద్ర ఎన్నికల సంఘంపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ కూడా రాజ్యాంగ పరిధి దాటి ప్రవర్తిస్తుంది అని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ ప్లీనరీలో సీఎం కేసీఆర్ అధ్యక్షోపన్యాసం చేశారు భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ వ్యవస్థగా వ్యవహరించాలి. గౌరవాన్ని నిలబెట్టుకోవాలి. ఈ దేశంలో ఒక సీనియర్ రాజకీయ నాయకుడిగా, బాధ్యత గల పార్టీ అధ్యక్షుడిగా, ఒక ముఖ్యమంత్రిగాభారత ఎన్నికల సంఘానికి ఒక సలహా ఇస్తున్నాను. చిల్లరమల్లర ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరిస్తున్నాను.

కేసీఆర్ సభ పెట్టొద్దు ఇది ఏం కథ. ఇది ఒక పద్ధతా? కొందరు దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారు. నాగార్జున సాగర్ సభ పెట్టొద్దంటూ హైకోర్టులో కేసులు వేశారు. హుజూరాబాద్‌లో సభ నిర్వహించొద్దంటూ ప్రయత్నాలు చేస్తున్నారు. మన పార్టీ నాయకులు చాలా మంది హుజూరాబాద్ పోరాటంలో ఉన్నారు. హుజూరాబాద్ దళితులు అదృష్టవంతులు. ఈసీ ఏం చేసినా నవంబర్ 4 తర్వాత దళితబంధు అమలు జరిగి తీరుతోంది. నవంబర్ 4 వనరకు దళిత బంధు అమలును ఆపగలదు. హుజూరాబాద్‌లో గెల్లు శ్రీనివాస్ గెలిచి తీరుతాడు. గెల్లు శ్రీనివాస్ ను హుజూరాబాద్ ప్రజలు దీవించి, ఆశీర్వదిస్తారు. రాష్ట్రమంతటా దళిత బంధును అమలు చేస్తాం అని కేసీఆర్ స్పష్టం చేశారు.

### దళిత బంధు రాష్ట్ర ఆర్థిక పురోగతికి తోడ్పాటు

రాబోయే ఏడేండ్లలో బడ్జెట్ల ద్వారా మొత్తం రూ. 23 లక్షల కోట్లు ఖర్చు పెడుతామన్నారు. దళిత బంధుతోనే ఆగిపోం.. ఎన్నో కార్యక్రమాలు చేపడుతామన్నారు. అట్టడుగున ఉన్నందునే దళితులకు మొదట కార్యక్రమం చేపట్టాం. దళితబంధుపై పెట్టే పెట్టుబడి వృథా కాదు. దళిత బంధు రాష్ట్ర ఆర్థిక పురోగతికి తోడ్పాటునిస్తోందన్నారు. ఈ పథకం ద్వారా సంపద సృష్టి జరుగుతోంది. 75 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా ఇలాంటి ఆలోచన చేశారా? అని ప్రశ్నించారు.

### టీఆర్ఎస్ పార్టీకి రూ. 240 కోట్ల విరాళాలు

టీఆర్ఎస్ ఆర్థికపరంగా కూడా శక్తివతంగా తయారైంది. టీఆర్ఎస్‌కు కూడా విరాళాలు సమకూరాయి. రూ. 240 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ల విరాళాలు ఉన్నాయి. చట్టబద్ధమైన విరాళాల ద్వారా పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 31 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకుంటామని సీఎం కేసీఆర్ తెలిపారు.

### జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై సీఎం కేసీఆర్ ప్రశంసలు

టీఆర్ఎస్ ప్లీనరీ వేదికగా మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. మాజీ స్పీకర్ మధుసూదనచారి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత దళిత బంధుపై ప్రస్తావించగా, కేసీఆర్ స్పందించారు. దళిత బంధు కేవలం రూ. 10 లక్షలిచ్చి మమ అనే కార్యక్రమం కాదు అని సీఎం అన్నారు. దళితుల గురించి అనేక ప్రయత్నాలు జరిగాయి. మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి.. సర్పంచ్‌గా పని చేసిన కాలంలో సొంత గ్రామంలో 10 ఎకరాల భూమి(ఇప్పుడు రూ. 50 లక్షల విలువ) ఆరుగురు దళితులకు పంచి పెట్టారు. అలా అనేక మంది ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వాలు కూడా కొన్ని కార్యక్రమాలు అమలు చేశాయి. కానీ అనుకున్న ఫలితాలు రాలేదు. ఆశలు నెరవేరలేదు. అందువల్ల వారు సఫర్ అవుతున్నాయి. అవన్నీ ఓవర్ కమ్ కావడానికి 10 లక్షలు ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వం లైసెన్సులు ఇచ్చే విషయంలో.. మెడికల్, వైన్, ఫర్టిలైజర్స్ షాపులతో పాటు మొదలైన వాటిలో ఎస్సీలకు రిజర్వేషన్లు పెడుతున్నాం. రక్షణ నిధిని కూడా ఏర్పాటు చేస్తున్నాం. జబ్బు చేసినా, రోడ్డుప్రమాదం జరిగినా కూడా దళిత బంధు రక్షణ నిధి నుంచి ఖర్చు పెడుతాం అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

## గులాబీ దళపతి కేసీఆరే.. తొమ్మిదోసారి కూడా ఏకగ్రీవమే..

హైదరాబాద్ , అక్టోబర్ 25:టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వరుసగా తొమ్మిదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి ప్లీనరీ వేదికగా ప్రకటించారు. అనంతరం సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ పేరును ప్రతిపాదిస్తూ మొత్తం 18 సెట్ల నామినేషన్లు దాఖలైన విషయం తెలిసిందే. పార్టీలోని అన్ని విభాగాలు, అన్ని సామాజికవర్గాల నేతలు కేసీఆర్ పేరును ప్రతిపాదిస్తూ నామినేషన్లు దాఖలుచేశారు. అధ్యక్ష పదవికి ఇతరులెవ్వరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో కేసీఆర్ ఎన్నిక ప్రకటన ఏకగ్రీవమైంది.

పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ ఇప్పటివరకు వరుసగా ఎనిమిదిసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఇది 9వ సంస్థాగత ఎన్నిక. చివరిసారిగా 2017లో రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎన్నిక జరిగింది. 2019లో పార్లమెంట్ ఎన్నికలు, 2020, 2021లో కరోనా కారణంగా పార్టీ ప్లీనరీ నిర్వహించలేదు.

## నిలిచి గెలిచిన పార్టీ.. టీఆర్ఎస్: కేకే

హైదరాబాద్ , అక్టోబర్ 25:కేసీఆర్ లాంటి నేత తెలంగాణకు దొరకడం రాష్ట్ర ప్రజల అదృష్టమని టీఆర్ఎస్ సెక్రెటరీ జనరల్ కే కేశవరావు అన్నారు. ఉద్యమం చేసిన నేతలు పాలనా పగ్గాలు చేపట్టడం అరుదు, ఎందరికో దక్కని ఈ ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. హైటెక్స్‌లో జరుగుతున్న టీఆర్ఎస్ ప్లీనరీలో కేకే స్వాగతోపన్యాసం చేశారు. కేవలం టీఆర్ఎస్‌కే కాదు యావత్ తెలంగాణ ప్రజలకు ఇది పండుగ రోజని చెప్పారు. తెలంగాణ కోసమే పుట్టి, అనుకున్న లక్ష్యాన్ని సాధించి.. ఏడున్నర ఏండ్లుగా అద్భుతమైన పాలన అందిస్తున్న టీఆర్ఎస్ పార్టీకి ద్విదశాబ్ది శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో కష్ట నష్టాలకోర్చి తన మేధస్సుకు పదను పెట్టి తెలంగాణ దశ మారుస్తున్న సీఎం కేసీఆర్ పార్టీ అధ్యక్షుడిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికవడం మనకందరికీ గర్వ కారణమన్నారు.

సాంస్కృతిక విప్లవంతో తెలంగాణను రీ డిస్కవర్ చేసిన టీఆర్ఎస్ పార్టీ.. ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నదని చెప్పారు. దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీలకు దీటుగా టీఆర్ఎస్ నిలిచి గెలిచిందని, తద్వారా తెలంగాణ అస్థిత్వాన్ని నిలబెట్టగలిగిందన్నారు.

తెలంగాణ వారికి పాలించుకోవడం చేతకాదని అహంకారంతో విమర్శించిన వారికి ప్రజలే కేంద్రంగా అద్భుతమైన పాలన అందిస్తూ ఇదీ తెలంగాణ అని చాటిన నేత కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ పాలనతో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రపథంలో దూసుకుపోతున్నదని చెప్పారు. కేసీఆర్ ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న పథకాలు దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొంది రోల్ మోడల్‌గా మారాయన్నారు.

'ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న తెలంగాణ నేడు అన్నదాతలకు స్వర్గధామంగా మారుతోంది. అభివృద్ధి, సంక్షేమం కనబడని వాళ్లే టీఆర్ఎస్ పాలనను, కేసీఆర్ తీరును విమర్శిస్తున్నారు. ఏ పార్టీలో ఉన్న నాయకుడైనా గుండె మీద చేయి వేసుకుని ఒక నిమిషం ఆలోచిస్తే అప్పటి తెలంగాణకు.. ఇప్పటి తెలంగాణకు ఉన్న తేడా అర్థమవుతుంది. కేంద్ర ప్రభుత్వ పరంగా ఏ గణాంకాలు చూసినా తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు జాతీయ స్థాయి కన్నా మెరుగ్గానే ఉన్నాయి. తలసరి ఆదాయం పెరిగింది. ఐబటజూ రెట్టింపు అయ్యింది. దేశానికి అధిక ఆదాయాన్నిస్తున్న టాప్ 5 రాష్ట్రాల్లో తెలంగాణ చేరడం ఉట్టి మాటలతో సాధ్యం కాలేదు.. కేసీఆర్ గట్టి సంకల్పంతోనే ఇది సాధ్యపడింది.' అని కేకే అన్నారు.

# యూపీ పోరు : 9 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన మోదీ

హైదరాబాద్ , అక్టోబర్ 25: వచ్చే ఏడాది యూపీ అసెంబ్లీ ఎన్నికలకు పాలక బీజేపీ సన్నద్ధమవుతోంది. గత ఐదు రోజుల్లో రెండోసారి యూపీ పర్యటనకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం సిద్దార్థనగర్ చేరుకున్నారు. సిద్దార్థనగర్, ఈటా, హర్దోయ్, ప్రతాప్‌ఘఢ్, ఫతేపూర్, దియోరియా, ఘజీపూర్, మీర్జాపూర్, జాన్పూర్ జిల్లాల్లో 9 మెడికల్ కాలేజీలను ప్రధాని ఈ సందర్భంగా ప్రారంభించారు. గత పాలకులు తమ కుటుంబ లాకర్లు నింపుకోవడంలో తలమునకలై స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేశారని మోదీ విమర్శలు గుప్పించారు.

ఒకేసారి తొమ్మిది వైద్య కళాశాలలను గతంలో ఎన్నడైనా ప్రారంభించడం చూశారా అని ప్రశ్నించారు. పూర్వాంచల్ ప్రజలను గత ప్రభుత్వాలు గాలికొదిలేశాయని, తమ హయాంలో పూర్వాంచల్ ప్రాంతం ఉత్తరాదికే మెడికల్ హబ్‌గా మార్చామని చెప్పుకొచ్చారు. ఇక ప్రధాని మోదీ తన నియోజకవర్గం వారణాసిలో రూ 5200 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు.



## బొల్లారంలో భారీగా గుట్కా ప్యాకెట్ల పట్టివేత

హైదరాబాద్ , అక్టోబర్ 25: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిషేధిత గుట్కా వ్యాపారంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అక్రమంగా నిల్వ చేసిన నిషేధిత గుట్కా ప్లాకెట్లను బొల్లారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్‌లో నిషేధిత గుట్కా ప్యాకెట్లు నిల్వ చేశారనే పక్కా సమాచారంతో పోలీసులు దత్తు అనే కిరాణా వ్యాపారస్తుడి దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. అమ్మకానికి నిలువ ఉంచిన నిషేధిత భారీ గుట్కా బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పట్టుకున్న గుట్కా విలువ రూ. 10లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రశాంత్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అక్రమంగా గుట్కా రవాణా చేసినా నిల్వ చేసి అమ్మకాలు జరిపినా సదరు వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐ జయశంకర్, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలపై 'శతాబ్ది ఉత్సవాలు జరుపుకోండి'.. కేంద్రానికి చిదంబరం చురకలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 25:దేశంలో పెరుగుతున్న ఇంధన ధరలపై కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పీ చిందంబరం సోమవారం కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ధరల పెరుగుదల విషయంలో కేంద్రం శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలంటూ చురకలంటించారు. ఇతర శతాబ్ది ఉత్సవాల మాదిరిగానే.. ప్రధాని నేతృత్వంలోని మంత్రులు ఇటీవల 100 కోట్ల డోసుల టీకా పంపిణీపై సంబురాలు చేసుకున్నారని చిదంబరం గుర్తు చేశారు.

ఇప్పటికే దేశంలో లీటర్ పెట్రోల్, డీజిల్ రూ. 100 దాటాయని పేర్కొన్నారు. గ్యాస్ ధరలు రూ. 1000 దాటితే మరోసారి సంబురాలు చేసుకునే అవకాశం ఉందని ఎద్దేవా చేస్తూ చిదంబరం ట్వీట్ చేశారు. ఆదివారం వరకు వరుసగా ఐదు రోజుల పాటు దేశంలో ఇంధన ధరలు పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.59, డీజిల్ రూ. 96.32 పలుకుతోంది.

# సీఎం కేసీఆర్‌ది చలించిపోయే హృదయం : కడియం శ్రీహరి

హైదరాబాద్ , అక్టోబర్ 25:ముఖ్యమంత్రి కేసీఆర్‌ది చలించిపోయే హృదయం అని మాజీ మంత్రి, టీఆర్ఎస్ నాయకులు కడియం శ్రీహరి అన్నారు. టీఆర్ఎస్ ప్లీనరీ సందర్భంగా సంక్షేమ తెలంగాణ సాకారం అనే తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ కడియం శ్రీహరి మాట్లాడారు. ఉద్యమ సమయంలో లక్షలాది మంది ప్రజలను కేసీఆర్ కలుసుకున్నారు. వారి బాధలు, కష్టాలు, ఆకలిచావులు, ఆత్మహత్యలను స్వయంగా చూసి చలించిపోయారు. ఉద్యమంలో ఆయన చూసిన సన్నివేశాల నుంచి పుట్టినవే ఈ సంక్షేమ పథకాలు. దేశమే అబ్బురపడే విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి.

వృద్ధ తల్లిదండ్రులకు పెద్దకొడుకు. ఆడబిడ్డలకు మేనమామ. ఒంటరి మహిళలకు తోబుట్టువు.. దళితులకు ఒక బంధువు అని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల జీవితాలకు భరోసా కల్పిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆసరా పెన్షన్లు ఇస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక వనరులను దృష్టి పెట్టుకుని ఆసరా పెన్షన్లను క్రమక్రమంగా పెంచుతున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల వల్ల నిరుపేద ఆడబిడ్డలు సంతోషంగా ఉన్నారు. ఈ రెండు పథకాలు ఓట్ల కోసం, రాజకీయాల కోసం ప్రవేశపెట్టలేదు. పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో.. ప్రతి కుటుంబానికి రేషన్ బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇస్తున్నామని పేర్కొన్నారు. మన సంక్షేమ పథకాల్లో ప్రతిదానికి ఒక కథ, ప్రాధాన్యత ఉంది. సీఎం కేసీఆర్ గొప్ప మానవతావాది అని చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్లల్లో చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య కోసం అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ప్రవేశపెట్టారు. అన్ని కులాలను సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారు. ఆర్థిక పరిపుష్టి కోసం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సీఎం కేసీఆర్ బలోపేతం చేస్తున్నారు. బ్రహ్మణ, అర్చకుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు అని కడియం శ్రీహరి తెలిపారు.

## దళితబంధు'పై తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్ , అక్టోబర్ 25:హుజూరాబాద్‌లో దళితబంధు పథకం నిలిపివేతపై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ, జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి ధర్మాసనం మూడు పిటిషన్లపై విచారణ జరిపింది. మల్లేపల్లి లక్ష్మయ్య, జడ్సన్, వాచ్ వాయిస్ ఆఫ్ పీపుల్ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి, హుజూరాబాద్‌లో దళితబంధు కొనసాగించాలని లక్ష్మయ్య, జడ్సన్ న్యాయస్థానాన్ని కోరారు.

ప్రత్యక్ష లబ్ధి బదిలీ పథకాలు, ఉప ఎన్నిక పూరయ్యే వరకు నిలిపివేయాలని వాచ్ వాయిస్ పీపుల్ సంస్థ కోరింది. ఈ మేరకు వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. దళితుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకాన్ని ప్రకటించి.. హుజూరాబాద్ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ఈ నెల 30న హుజూరాబాద్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం పథకాన్ని నిలిపివేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పథకాన్ని కొనసాగించేలా చూడాలంటూ మల్లేపల్లి లక్ష్మయ్య, జడ్సన్ హైకోర్టును ఆశ్రయించారు.

## కలెక్టరేట్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్, అక్టోబర్ 25: జిల్లా కలెక్టరేట్లో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జక్రాన్ పల్లి మండలం మాడుగుల గ్రామానికి చెందిన యాదగిరి అనే వ్యక్తి కలెక్టరేట్లో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్థానిక పోలీసులు అప్రమత్తమై వెంటనే అడ్డుకున్నారు.

మాడుగుల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తన భూమిని కొనుక్కొని డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తూ యాదగిరి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు.

## తెలంగాణ గళం.. బలం.. దళం.. కేటీఆర్ : కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ , అక్టోబర్ 25:స్వరాష్ట్రం కోసం అలుపెరగని పోరాటం చేసి, రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ, తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా టీఆర్ఎస్ పార్టీ నిలిపిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. టీఆర్ఎస్ పార్టీ ద్విదశాబ్ది వేడుకల సందర్భంగా రెండు కవితలను కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణ గళం.. బలం.. అగ్రగామి దళం.. టీఆర్ఎస్ పార్టీ మాత్రమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మట్టి కోసమే పుట్టి గమ్యాన్ని ముద్దాడిన విముక్తి కేతనానికి 20 ఏండ్ల పండుగ అంటూ కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## బీసీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు : మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ , అక్టోబర్ 25: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచింది అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్లీనరీలో సంక్షేమ తెలంగాణ సాకారంపై ప్రవేశపెట్టిన తీర్మానాలను మంత్రి శ్రీనివాస్ గౌడ్ బలపరిచారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గత పాలకులు కొన్ని కులాలను పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు మేలు జరిగిందన్నారు.

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్ని కులాలకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని కులాలను, వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ముందుకెళ్తున్నారు. ప్రతి వృత్తికి, కులానికి కేసీఆర్ గౌరవం కల్పించారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ప్రతి ఒక్కరూ ఎదుగుతున్నారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో చదువుతున్నారు.

భారతదేశంలో కనీసం 60 శాతం జనాభా ఉన్న బీసీలను కేంద్రం పట్టించుకోవడం లేదు. కానీ తెలంగాణలో బీసీల అభివృద్ధికి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ముదిరాజ్, గంగపుత్రుల సోదరులు మత్స్య సంపద సృష్టిస్తున్నారు. పౌష్టికాహారం ఇప్పుడు అందరికీ అందుతుంది. హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు తెరిపించారు. కల్లు గీత కార్మికులకు చెట్ల పన్ను రద్దు చేశారు. వైన్ షాపుల్లో బీసీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అంధకారంలో ఉన్న చేనేత వృత్తిని ఆదుకున్నారు. నాయీ బ్రాహ్మణులకు, రజకులకు ఉచితంగా కరెంట్ అందిస్తున్నారు. అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు కట్టిస్తున్నారు అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం : ముగ్గురు మృతి

మేడ్చల్, అక్టోబర్ 25: కీసర మండలం యాద్గార్‌పల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు.

మృతులను సైబర్ క్రైమ్ ఏసీపీ ప్రసాద్ కుటుంబ సభ్యులుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో ఏసీపీ కేవీఎం ప్రసాద్ సతీమణి శంకరమ్మ, సోదరుడి కుమారుడు భాస్కర్ దంపతులు మృతి చెందారు. ఏసీపీ సోదరుడు బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. బాలకృష్ణను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రకాశం జిల్లా చీరాలలో వివాహ వేడుకకు వెళ్లొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

### చరిత్రలో నేటినిజం


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం




కం॥ మదిలోగల కాశ్మీరును
విడుదై రాజేంద్రసింగు వే విధములుగా
పదిల మ్మొనరించ - ప్రభుత -
మొదటి మహావీర చక్రమును యందించెనే!!

(అక్టోబర్ 26 మొదటి మహావీర చక్ర పురస్కార గ్రహీత రాజేంద్రసింగు వర్ధంతి...)

–రాధశ్రీ

సెల్: 9494481210




నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



హైదరాబాద్ , అక్టోబర్ 25:టీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబర్ 10లోని సింగాడకుంట బస్తీ సంక్షేమసంఘం అధ్యక్షుడు, టీఆర్ఎస్ నేత మహ్మద్ ఎజాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తమ దృష్టికి తీసుకొస్తే తగిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు ఇమ్రాన్, మహ్మద్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్‌లోకి పట్టాభి.. అరెస్ట్ చేస్తారన్న భయంతోనేనా..

అమరావతి, అక్టోబర్ 25:ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టై బెయిల్‌పై వచ్చిన టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోయారు. శనివారం రాత్రి రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన ఆయన గన్నవరం సమీపంలోని పొట్టిపాడు టోల్ ప్లాజాకు 10.30 సమయంలో చేరుకున్నారు.

టోల్ ప్లాజా వద్ద భారీగా మోహరిం చిన పోలీసులు పట్టాభి వాహనం వెనుక కాన్వాయ్‌గా వస్తున్న ఇతర వాహనాలను నిలిపివేశారు. పట్టాభి కారును తమవెంట తీసుకువెళ్లారు. దీంతో పట్టాభి కుటుంబ సభ్యులతో పాటు తెలుగుదేశం నేతలు కొంత ఆందోళనకు గురయ్యారు. అదే సమయంలో పట్టాభి సెల్‌ఫోన్‌తో పాటు బాడీగార్డ్, డ్రైవర్ ఫోన్లు కూడా పనిచేయక పోవడంతో మరింత టెన్షన్‌కు లోనయ్యారు. దీనికి తోడు పోలీసులు పట్టాభి అదృశ్యంతో తమకు సంబంధం లేదని తమ అదుపులో లేడని తేల్చిచెప్పడం గందర గోళానికి దారి తీసింది.

సుమారు గంట తర్వాత అర్ధరాత్రి సమయంలో తాను సురక్షితంగా ఉన్నట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే పట్టాభిపై మరో నాలుగు కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. బెయిల్‌పై విడుదల అయిన తనను ఈ కేసుల్లో పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతోనే అజ్ఞాతంలోకి వెళ్లినట్లుగా సమాచారం.

# ముగిసిన చందానగర్ ఆలయ రజతోత్సవాలు

హైదరాబాద్ , అక్టోబర్ 25: చందానగర్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రజతోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ పర్యవేక్షణలో ఐదు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయం 5 నుంచి మొదలుకొని రాత్రి 9 గంటల వరకు స్వామివారికి హారతి, తీర్థప్రసాదాలు, చండీ యాగం, మహా పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర స్వామి మాట్లాడుతూ.. చందానగర్ ఆలయ విశిష్టతను వివరించారు. విశాఖ శ్రీ శారదాపీఠ పాలిత ఆలయాల్లో చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రధానమైనదని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు ఇష్టదైవం రాజశ్యామల అమ్మవారని స్వామిజీ తెలిపారు.

చందానగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ రజతోత్సవాల్లో భాగంగా సినీ నటుడు మోహన్‌బాబు, ఫీనిక్స్ కన్‌స్ట్రక్షన్ అధినేత సురేశ్, శారదాపీఠం శాశ్వత సభ్యులు మిర్యాల రాఘవరావు, ఆలయ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రవీణ్, శేషయ్య తదితరులు విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు.

# అధికారంలోకి వస్తే రూ 10 లక్షల వరకూ ఉచిత వైద్యం : ప్రియాంక గాంధీ

లక్నో. అక్టోబర్ 25:: వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హామీల వర్షం కొనసాగుతోంది. తాము అధికారం చేపట్టగానే విద్యార్థినులకు స్మార్ట్‌ఫోన్లు, స్కూటీలు అందిస్తామని, రైతుల రుణాలు మాఫీ చేస్తామని, 20 లక్షల ఉద్యోగాలు యువతకు అందుబాటులోకి తీసుకువస్తామని పలు హామీలు గుప్పించిన ప్రియాంక గాంధీ తాజాగా మరో కీలక వాగ్దానం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ 10 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్స అందిస్తామని ప్రకటించారు. కొవిడ్-19 బాధితులకు ఊతంగా బాధిత కుటుంబానికి రూ 25,000 పరిహారం ఇస్తామని ఆమె ఇప్పటికే వెల్లడించారు. యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో 40 శాతం టికెట్లు మహిళలకు కేటాయిస్తామనీ ఆమె ప్రకటించిన సంగతి తెలిసిందే.



# కొవిడ్ బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : ఐజేయూ




హైదరాబాద్ , అక్టోబర్ 25:కొవిడ్ బాధిత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసింది.

దేశ వ్యాప్తంగా కొవిడ్ బారినపడి మృతిచెందిన దాదాపు 600 మంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని, ఈ ఏడాది వివిధ రాష్ట్రాల్లో హత్యలకు గురైన ఐదుగురు జర్నలిస్టుల కుటుంబాలకు పరిహారం అందించాలని డిమాండ్ చేసింది. ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ జస్టిస్ సి.కె.ప్రసాద్ నియంతృత్వ, చట్ట వ్యతిరేక చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. జాతీయ యూనియన్లకు 14వ కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం లేకుండా చేసిన జస్టిస్ ప్రసాద్ చర్యలపై న్యాయపోరాటం సాగించాలని తీర్మానించింది.

దేశంలో జర్నలిస్టులపై, మీడియా సంస్థలపై సంఘ వ్యతిరేక శక్తులు, కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సాగిస్తున్న కక్ష్య సాధింపు చర్యలను సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన మీడియా రంగాన్ని బలహీనపరిచే చర్యలకు స్వస్తి పలకాలని పేర్కొంది.

ఆదివారం జరిగిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాత్రికేయులను ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తించేలా కృషి చేస్తానని తెలిపారు.

ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ సమాచార శాఖ కమిషనర్ విజయ్ కుమార్‌రెడ్డి, జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, ఐజేయూ మాజీ అధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా, జాతీయ ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్, ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వరింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఉప ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుకు డ్రోన్ ట్రీట్‌మెంట్

హైదరాబాద్ , అక్టోబర్ 25:జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన రాకుండా శాశ్వత చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అర్విండ్ కుమార్ పేర్కొన్నారు. డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు రాగా, మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌తో కలిసి అర్విండ్ కుమార్ డంపింగ్ యార్డును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.



**యార్డులో 28 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం..**

డంపింగ్ యార్డులో 28 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని (రెండో యూనిట్) ఏర్పాటు చేయనున్నట్లు ప్రిన్సిపల్ కార్యదర్శి అర్విండ్ కుమార్ వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి నవంబర్‌లో క్లియరెన్స్ వస్తుందని, అనుమతులు వచ్చిన 18 నెలల్లో పనులు పూర్తి చేయిస్తామన్నారు. డంపింగ్ యార్డులో ఇప్పటికే ఉన్న 20 మెగా వాట్ల ఉత్పత్తి కేంద్రంతో పాటు రెండో యూనిట్‌లో 28 మెగా వాట్లతో కలిపి మొత్తం 48 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుందన్నారు. ఇందుకోసం 7 వేల టన్నుల చెత్త అవసరం ఉంటుందని, నగరం నుంచి ప్రతిరోజు వచ్చే 7 వేల 4 వందల టన్నుల చెత్తను నిల్వ ఉంచకుండా నేరుగా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించడంతో దుర్వాసన రాకుండా ఉంటుందన్నారు. దీంతో శాశ్వత పరిష్కారం లభించడం ఖాయమన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రూ.700 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు అర్విండ్ కుమార్ తెలిపారు.

**యార్డు సమీపంలో చెరువుల శుద్ధికి రూ.286 కోట్లు..**

డంపింగ్ యార్డు సమీపంలోని కలుషితమైన చెరువులను శుద్ధి చేసేందుకు రూ.230 కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు ప్రిన్సిపల్ కార్యదర్శి అర్విండ్ కుమార్ తెలిపారు. 8 చెరువులు కలుషితమైనట్లు గుర్తించామని.. త్వరలో అందులోని నీటిని శుద్ధి చేసి సుందరీకరిస్తామన్నారు. రూ.146 కోట్ల నిధులతో చెత్త కుప్పల క్యాపింగ్ చేసి సీఎన్జీ, సీపీజీ గ్యాస్ తయారీ చేస్తున్నట్లు తెలిపారు. దుండిగల్‌లో చెత్త ద్వారా 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి పనులు జరుగుతున్నాయని, 2022 జూన్ నాటికి పనులు పూర్తి అవుతాయన్నారు.

**దుర్వాసన రాకుండా డ్రోన్లతో రసాయనాల పిచికారీ..**

డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన రాకుండా తక్షణ చర్యల్లో భాగంగా నేటి నుంచి డ్రోన్ల సహాయంతో రసాయనాలు పిచికారీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ కార్యదర్శి అర్విండ్ కుమార్ తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. దుర్వాసన రాకుండా రాంకీ గ్రూప్ ఉద్యోగులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**నగరంలో నాలుగు వైపులా డంపింగ్ యార్డులు**

నగరంలో నాలుగు వైపులా డంపింగ్ యార్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు డంపింగ్ యార్డుల కోసం స్థలాలను గుర్తిస్తున్నట్లు అర్విండ్ కుమార్ వివరించారు. ఇప్పటికే లక్డారం ప్రాంతంలో 120 ఎకరాలు, గ్యారీనగర్‌లో 150 ఎకరాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. మరికొన్ని చోట్ల స్థలాలు గుర్తించాల్సి ఉందన్నారు. అధికారులు, రాంకీ గ్రూప్ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించిన అనంతరం, డంపింగ్ యార్డులో అర్విండ్ కుమార్, మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేశ్‌కుమార్ మొక్కలు నాటారు. డంపింగ్ యార్డులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, బయోగ్యాస్, చెత్త ద్వారా తయారయ్యే ఎరువులను మేయర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ కార్యదర్శి అర్విండ్ కుమార్, కమిషనర్ లోకేశ్ కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

**దుర్వాసన రాకుండా చర్యలు**

డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని, రాంకి గ్రూప్ నిర్వాహకులకు తగు సూచనలు చేశాం. అందుకు వారం రోజుల గడువు ఇచ్చాము, వారం తర్వాత ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలించాం. 15 రోజులలో చేపట్టిన చర్యలను మరోసారి పరిశీలిస్తాం. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజలకు ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. వారికి అందుబాటులో ఉంటాం. స్థానికులు ఇక్కడి సమస్యలను మా దృష్టికి తీసుకరావడంతో యార్డును సందర్శించాం. ? గద్వాల విజయలక్ష్మి, నగర మేయర్

# జహీరాబాద్‌లో వెయ్యికోట్లతో డిఫెన్స్ సిస్టమ్స్

**-రెండు వేల మందికిపైగా ఉద్యోగాలు**
**-'రక్షణ' పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్: మంత్రి కేటీఆర్**
**-తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉన్నది**
**-డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి ప్రశంస**
**-రాష్ట్ర ప్రభుత్వంతో వెమ్ టెక్నాలజీస్ పరస్పర అవగాహన ఒప్పందం**

హైదరాబాద్ , అక్టోబర్ 25: ఏరోస్పేస్, రక్షణ రంగ పెట్టుబడులకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ.1,000 కోట్ల పెట్టుబడితో 'లార్జ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ సిస్టమ్స్'ను స్థాపించనున్నది. ఇందుకోసం ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొన్నది. ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్, డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి, నీతిఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, వెమ్ టెక్నాలజీస్ సీఎండీ వీ వెంకటరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మా ట్లాడుతూ.. ఏరోస్పేస్, రక్షణ రంగాలకు సంబంధించి రాష్ట్రంలో వెయ్యికి పైగా ఎంఎస్ఎంఈలు, డీఆర్డీవో, బీడీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు, ఇతర సూక్ష్మ సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు.

వీటితోపాటు లాక్‌హీడ్, బోయింగ్, జీఈ, సాఫ్రన్ వంటి అంతర్జాతీయ సంస్థలకు సైతం హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో నాణ్యమైన మానవ వనరులు ఉండటంతో ఏరోస్పేస్, రక్షణరంగ పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందన్నారు. వెమ్ టెక్నాలజీస్ పెట్టుబడితో రెండువేలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించారు. జహీరాబాద్‌లో వెమ్ టెక్నాలజీస్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించటంపై సంతోషం వ్యక్తంచేశారు. ఈ కేంద్రంతో స్థానిక యువతకు నైపుణ్యాలు పెరిగి, ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని చెప్పారు. వెమ్ టెక్నాలజీస్ విజ్ఞప్తి మేరకు ప్రాజెక్టుకు మెగా ప్రాజెక్ట్ హోదా ఇస్తామని, వారు కోరినవిధంగా 511 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని వెల్లడించారు. నాలుగేండ్ల కిందట డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి తనతో మాట్లాడుతూ 2017-22 మధ్య హైదరాబాద్‌కు రూ.లక్ష కోట్ల రక్షణరంగ ఆర్డర్లు వస్తాయని చెప్పారని, అది ఇప్పుడు వాస్తవరూపం దాల్చుతున్నదని ఆయన గుర్తుచేశారు.

**పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం: సతీశ్‌రెడ్డి**

తెలంగాణలో పెట్టుబడుల అనుకూల వాతావరణం ఉన్నదని డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి ప్రశంసించారు. అధికారులు ప్రతిక్షణం అందుబాటులో ఉండి, రాష్ట్ర అనుకూలతలను వివరిస్తారని చెప్పారు. నగరంలోని కంపెనీలతో డీఆర్డీవో అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. నీతిఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పలు రక్షణరంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు చూస్తున్నదని, వెమ్ టెక్నాలజీస్ వంటి హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే భారతీయ కంపెనీలు ఈ అవకాశాలను అందిపుచ్చుకొనే స్థాయిలో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు : టీఆర్ఎస్ ఎన్నారై ఒమాన్ శాఖ



హైదరాబాద్ , అక్టోబర్ 25: టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు టీఆర్ఎస్ ఎన్నారై ఒమాన్ శాఖ అధ్యక్షుడు ఈగపూరి మహిపల్ రెడ్డి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. పదవులను తృణపాయంగా వదిలేసి, ఒక్క అడుగుతో తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. బంగారు తెలంగాణ సాధనే ధ్యేయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. పార్టీ ద్విశతాబ్ది వేడుకల్లో పాల్గొంటున్న నాయకులకు, కార్యకర్తలకు మహిపల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# టీఆర్ఎస్ ప్లీనరీలో టీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులు

హైదరాబాద్ , అక్టోబర్ 24: టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆధ్వర్యంలో ఎన్నారై ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చుతున్నారని ప్రశంసించారు. రైతుబంధు, దళిత బంధు పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. టీఆర్ఎస్ పార్టీ ద్విశతాబ్ది వేడుకల్లో టీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులు పాల్గొన్నట్లు మహేశ్ బిగాల తెలిపారు. అలాగే ఎన్నారైలకు మొట్ట మెదటి సారి కేసీఆర్ తరపున అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం కల్పించిన పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఫస్టియర్ పరీక్షలు



హైదరాబాద్ , అక్టోబర్ 25: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కరోనా కారణంగా గతేడాది ఇంటర్ పరీక్షలు జరగని విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఫస్టియర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,769 పరీక్ష కేంద్రాల్లో 4,59,228 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. కరోనా జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రానికి వచ్చిన ప్రతి విద్యార్థికి థర్మల్ స్క్రీనింగ్, హాండ్ శానిటైజేషన్ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. నేడు జరుగుతున్న సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సెట్-ఏ ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేశారు.

# పుట్టింటికి వెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

హైదరాబాద్ , అక్టోబర్ 25: పుట్టింటికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ గర్భిణి ప్రాణాలు విడిచింది. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డి గూడ వద్ద చోటు సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన దాసరి శైలజ పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురంలో పుట్టింటికి వెళ్లి తిరిగి కారులో వస్తున్నది. ఈ క్రమంలో లింగారెడ్డిగూడ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. కారులో ఉన్న శైలజ మృతి చెందగా.. మరో ముగ్గురికి గాయాలవగా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్లీనరీ సమావేశం లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ,తెరాస పట్టణ అధ్యక్షుడు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 25:నేటినిజం (ప్రతినిధి): హైదరాబాద్లో సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర సమితి విస్తృత సాయి ప్లీనరీ సమావేశం లోవేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు , టీఆర్ఎస్ నాయకులు కందుల క్రాంతికుమార్ పాల్గొన్నారు



# దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్ అందుకున్న రజనీకాంత్.. ప్రౌడ్ మూమెంట్ అంటూ ట్వీట్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 25:సినీ పరిశ్రమలో దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా సేవలు అందించిన రజనీకాంత్ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డు అందుకున్నారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆయనకు అవార్డును అందజేశారు. సినీ రంగంలో నటనతో ప్రేక్షకులను అలరిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్న రజనీకాంత్‌కి ఈ విశిష్ట గౌరవం దక్కడం పట్ల అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే ఏడాదిలో రజనీకాంత్ ఆయన అల్లుడు ధనుష్ అవార్డులు అందుకోవడం పట్ల సూపర్‌స్టార్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే అవార్డుల ప్రధానోత్సవంలో హీరో ధనుష్ అసురన్ చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు. కాగా, రజనీకాంత్ కేవలం హీరోగానే కాకుండా.. దర్శకుడిగా.. నిర్మాతగా సినీ పరిశ్రమలో నిజంగానే సూపర్ స్టార్ అనిపించుకున్నారు రజనీకాంత్. ఇప్పటికీ యంగ్ హీరోలకు గట్టి పోటీనిస్తూ వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు తలైవా.

అవార్డుల ప్రధానోత్సవానికి వెళ్లేముందు రజనీకాంత్ స్థానిక పోయెస్‌గార్డెన్‌లోని తన నివాసంలో



మీడియాతో ముచ్చటించారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు తనకు లభించడం సంతోషంగా ఉందని రజనీకాంత్ పేర్కొన్నారు.

ఇలాంటి శుభతరుణంలో తన గురువు కె.బాలచందర్ లేకపోవడం ఎంతో బాధగా ఉందన్నారు.

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు రావడం నాకెంతో ఆనందంగా ఉంది. ఇంత గొప్ప అవార్డు రావడం సినీ ప్రేక్షకులు, తమిళ ప్రజల ఆదరాభిమానాల వల్లే సాధ్యమైంది అని అన్నారు.

# మహా ఘోరం: మహిళను నరికేసి.. మృతదేహాన్ని కౌగిలించుకుని..!

జైపూర్, అక్టోబర్ 25: రాజస్థాన్ రాష్ట్రం జాలోర్ జిల్లాలో దారుణం జరిగింది. తన లైంగిక కోరిక తీర్చలేదని ఓ యువకుడు వివాహిత మహిళను హత్యచేశాడు. ఆపై పారిపోకుండా ఆమె మృతదేహాన్ని కౌగిలించుకుని పడుకున్నాడు. అహోర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధన్వారా ఏరియాలో ఇవాళ ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ధన్వారా ఏరియాకు చెందిన వివాహిత మహిళ శాంతిదేవి (32) స్థానికంగా తన ఇద్దరు కొడుకులతో కలిసి ఉంటున్నది. ఆమె భర్త మహారాష్ట్రలో పనిచేస్తూ అప్పుడప్పుడు వచ్చి భార్యకు డబ్బులు ఇచ్చి వెళ్తుంటాడు.

ఈ క్రమంలో స్థానికంగా ఉండే గణేశరమ్ (22) అనే యువకుడి కన్ను శాంతిదేవిపై పడింది. గత కొన్ని రోజులుగా ఆమెను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. తన కోరిక తీర్చాలని వెంటపడుతున్నాడు. అయితే, ఆమె అతని ప్రతిపాదనను తిరస్కరిస్తూ వచ్చింది. దాంతో గణేశరమ్ ఆమెపై వగ పెంచుకున్నాడు. ఇవాళ ఉదయం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనికి వెళ్లిన శాంతిదేవిని అందరి ముందే కత్తితో నరికిచంపాడు. ఆ తర్వాత ఆమె మృతదేహాన్ని కౌగిలించుకుని పడుకున్నాడు.

దాంతో తీవ్ర భయాందోళనకు గురైన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితుడి నుంచి శాంతిదేవి మృతదేహాన్ని విడిపించి పో?స్టు మార్టానికి తరలించారు. నిందితుడు గణేశరమ్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై ఐపీసీ సెక్షన్ 302 కింద కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం శాంతిదేవి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

# నూతన జిల్లా పోలీస్ కార్యాలయం,క్యాంప్ ఆఫీస్ జిల్లా సాయుధ దళ కార్యాలయాలను సందర్శించి జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 25:నేటినిజం ప్రతినిధి): ..జిల్లా ప్రజలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సత్వర పోలీస్ సేవలు అందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వంప్రతిష్టాత్మకనీగా అన్ని హంగులతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో నిర్మిస్తున్న జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాల సముదాయాన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకరావాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే హౌసింగ్ బోర్డ్ ఈ.ఈ కి సూచించారు.

సోమవారం నాడు జిల్లా కేంద్రం లోని సిరిసిల్ల బై పాస్ లో నిర్మాణం లో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయాల సముదాయాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పోలీస్ హౌసింగ్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథ్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ మరియు కాంట్రాక్టర్ లతో కలిసి సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు పూర్తి కావచ్చిన జిల్లా పోలీస్ కార్యాలయం, క్యాంప్ ఆఫీస్, క్యాంప్ రెసిడెన్సీ జిల్లా పోలీస్ సాయుధ దళ కార్యాలయ నిర్మాణ పనులను, ఇంకా



పూర్తి చేయవలసిన నిర్మాణ పనులు మరియు తదితర వివరాలను హౌసింగ్ ఈ.ఈ టి.శ్రీనివాస్ ఎస్పీ కివివరించారు. నూతన భవనాల సముదాయం నిర్మాణ అసంపూర్తి పనులపై ఆరా తీసి మిగులు పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని పనులు పూర్తి చేసేందుకు చేపట్టిన ప్లాన్ ఆఫ్ యాక్షన్ పై ఎస్పీ పోలీస్ హౌసింగ్ అధికారులతో సమీక్షించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ పై పలు మార్గదర్శకాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఎస్పీ వెంట పోలీస్ హౌసింగ్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథ్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ ,కాంట్రాక్టర్ ఉన్నారు.

# అప్పటి వరకు నీట్ పీజీ కౌన్సెలింగ్ నిర్వహించం.. సుప్రీం కోర్టుకు కేంద్రం హామీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 25:న్యూఢిల్లీ : ఇతర వెనుకబడిన తరగతులు (రాఃఅ), ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఇఏూ) రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే వరకు నీట్ పీజీ కౌన్సెలింగ్‌ను ప్రారంభించబోమని కేంద్రం సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చింది. సోమవారం సర్వోన్నత న్యాయస్థానం నీట్ పీజీ కౌన్సెలింగ్‌పై విచారణ జరిపింది. రిజర్వేషన్లపై నిర్ణయంపై తేలకుండా కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తే 'విద్యార్థులు తీవ్రమైన సమస్యలో పడతారు' అని ధర్మాసనం అభిప్రాయపడింది.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి నీట్ పీజీ ఆల్‌ఇండియా కోటాలో ఓబీసీలకు 27శాతం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈడబ్ల్యూఎస్)లకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గత జూలై 29న మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు నీట్ అభ్యర్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పీజీ మెడికల్ కోర్సుల్లో రిజర్వేషన్ల విషయమై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా నీట్ పీజీలో రిజర్వేషన్లు కేటాయించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ కొనసాగుతుండగా.. ఈ నెల 25 నుంచి నీట్ పీజీ కౌనెల్సింగ్‌ను కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో విద్యార్థులు మళ్లీ ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రిజర్వేషన్ల చెల్లుబాటుపై నిర్ణయం తీసుకునే వరకు కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలని డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రం కౌన్సెలింగ్‌ను నిలిపివేయనున్నట్లు కోర్టుకు హామీ ఇచ్చింది. విద్యార్థుల తరఫున సీనియర్ న్యాయవాది అరవింద్ దాతార్ వాదనలు వినిపించారు. న్యాయవాది అరవింద్ దాతార్ వాదనలు వినిపించారు.

# ప్రత్యేక రాష్ట్ర సాధనలో టీఎన్జీవో పాత్ర మరవలేనిది : ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్..

హుజూరాబాద్, అక్టోబర్ 25: ప్రత్యేక రాష్ట్ర సాధనలో టీఎన్జీవో పాత్ర మరవలేనిదని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కొత్తపల్లిలో సోమవారం ఆయన టీఎన్జీవో రిటైర్డ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 ఉద్యమం ప్రారంభమైన తర్వాత పాలకుల ఒత్తిడితో ఉద్యమం చల్లారిందన్నారు. అయితే ఆ సమయంలో టీఎన్జీవో నాయకులు ముందడుగు వేయడంతో తెలంగాణ ఆశయ సాధన కొన ఊపిరితో ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీఎన్జీవో సంఘం ఉండగా దీనికి భిన్నంగా తెలంగాణ ఉద్యోగులు టీఎన్జీవో ఏర్పాటు చేయడమనేది ఉద్యమ స్ఫూర్తిని అలాగే మిగిలించిందన్నారు. అప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాక టీఎన్జీవో విశ్రమించలేదన్నారు.

రాష్ట్ర సాధనలో కేసీఆర్ సమయ స్ఫూర్తితో తీసుకున్న నిర్ణయాలు చాలా గొప్పవి అని కొనియాడారు. అప్పటి ప్రభుత్వంలో భాగస్వాములు కావడంతో కొందరి నుంచి విమర్శలు వెల్లువెత్తాయన్నారు. వారి కారు, పెట్రోల్‌తోనే రాష్ట్రం సాధించాలని కేసీఆర్ ఒకటే మాట చెప్పేవారని, దీనికనుగుణంగా ఢిల్లీలో నాయకులను కలిసేందుకు ప్రభుత్వం ఇచ్చిన కారు ఎంతో ఉపయోగించుకొని ఆచరణలో పెట్టారన్నారు. ఈటల రాజేందర్ ఆత్మగౌరవానికి ప్రజలకు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. తన ఆత్మగౌరవాన్ని ప్రజల మీద రుద్దుతూ సానుభూతి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారని వినోద్ కుమార్ అన్నారు.

ఇప్పటి వరకు ఆయన ఎందుకు రాజీనామా చేసిండో ప్రజలకు చెప్పలేదన్నారు. ప్రజల మధ్య చిచ్చు రగిలించి ఓట్లు దండుకునేందుకు రాజేందర్ కుట్రలు చేస్తున్నారన్నారు. ఒక నదిని ఎత్తిపోయడం అనేది కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి చూపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. హింస లేకుండా స్వాతంత్ర్యం సాధించిన మాదిరిగానే కేసీఆర్ రాష్ట్రాన్నిసాధించారని కొనియాడారు. ఈ సమావేశంలో టీఎన్జీవో రాష్ట్ర నాయకుడు దేవిశ్రీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, టీఎంయూ రాష్ట్ర నాయకుడు థామస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హమీద్, నాయకులు హన్మంత్‌గౌడ్, విష్ణుదాసు గోపాల్‌రావు, ఎర్రం పాపిరెడ్డి, ఐలయ్య, దత్తాత్రేయ, మందల భాస్కర్, మధు తదితరులున్నారు

# చైనాను వదలని మహమ్మారి.. మరోసారి లాక్ డౌన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: చైనాను వదలని మహమ్మారి.. మరోసారి లాక్ డౌన్‌కరోనాకు పుట్టిల్లు అయిన చైనాను మహమ్మారి మరోసారి వణికిస్తోంది. కరోనా కేసులు పెరుగుతుండడం చైనా వాసులను ఆందోళన కలిగిస్తోంది. చైనాలోని అనేక ప్రాంతాల్లో, డెల్టా వేరియంట్‌కు చెందిన కరోనా వైరస్ వ్యాప్తి నిరంతరం పెరుగుతోంది. చైనా వాయువ్య ప్రాంతంలోని ఇన్నర్ మంగోలియాలోని ఐజిన్ కౌంటీలో పూర్తి లాక్ డౌన్ విధించారు. సోమవారం నుండి ప్రజలను ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. ఐజిన్ జనాభా 35,700 మంది ఉండగా.. కోవిడ్ ఆంక్షలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఏజిన్ కరోనా హాట్ స్పాట్‌గా ఉంది. గత వారం ఇక్కడ 150 మందికి పైగా వైరస్ సోకింది.

చైనా జాతీయ ఆరోగ్య కమిషన్ అధికారులు వారంలో కోవిడ్ వ్యాప్తి 11 రాష్ట్రాల్లో తీవ్రతరం అవుతుందని హెచ్చరించింది. సోమవారం ఇన్నర్ మంగోలియాలో 38 కోవిడ్ కేసులను కనుగొన్నారు. కరోనా వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో చైనా రాజధాని బీజింగ్ లోను ఆంక్షలు తీవ్రతరం చేశారు. బీజింగ్ సహా ఇన్నర్ మంగోలియా, గాన్సు, నింగ్జియా, గుయిజౌలలో కోవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# బాధితులకు న్యాయం చేయటానికి ప్రజాదివస్- జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 25:నేటినిజం ప్రతినిధి): బాధితులకు న్యాయం చేయడానికి ప్రజదివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్ లో 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణ చర్యలుతీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఫిర్యాదులు పెన్డింగ్ పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఎస్‌హెచ్‌ఓ లను ఆదేశించినట్లు చెప్పారు. సివిల్ సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు.

భూమిని నమోదు చేయమని లేదా పౌర వివాదాలకు పాల్పడాలని మరియు పరిష్కారాలు చేయమని పౌరులను ఎవరైనా బెదిరిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాము



మరియు ఇలాంటి సంఘటనలకు సంబంధించి ప్రజలు మా కార్యాలయానికి వచ్చి పిర్యాదు చేయవచ్చు.సివిల్ తగాధల్లో ఏ అధికారి కూడా తలదూర్చకిడదని ఏ అధికారి ఐన సివిల్ తగాధల్లో ఇబ్బందికి గురిచేస్తే నేరు గా జిల్లా పోలీస్ కార్యాలయంలో పిర్యాదు చేయవచ్చు అని జిల్లా ఎస్పీ చెప్పారు

# మహిళా సంక్షేమానికి పెద్దపీట : మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్ , అక్టోబర్ 25: రాష్ట్రంలోని మహిళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్లీనరీలో సంక్షేమ తెలంగాణ సాకారంపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మంత్రి సత్యవతి రాథోడ్ బలపరిచారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ 20 ఏండ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయి. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారు. మహిళల సంక్షేమం, భద్రత, రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. గత పాలకులు మహిళా సంక్షేమానికి రూ. నాలుగున్నర కోట్లు ఖర్చు చేస్తే.. గడిచిన ఏడేండ్లలో సీఎం కేసీఆర్ రూ. 10 వేల కోట్లు ఖర్చు పెట్టారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, కేసీఆర్ కిట్ పథకాలతో పాటు ఒంటరి మహిళ పెన్షన్లు, వితంతు పెన్షన్లు అమలు చేస్తున్నారు. కల్యాణలక్ష్మి పథకంతో బాల్య వివాహాలు తగ్గిపోయాయి. పిల్లల ఎదుగుదల, పెరుగుదల కోసం అంగన్‌వాడీ సెంటర్ల నుంచి బాలామృతంతో పాటు కోడిగుడ్లు అందిస్తున్నామని తెలిపారు. కొవిడ్ సమయంలోనూ సంక్షేమ పథకాలు కొనసాగాయి. మన పథకాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రశంసించింది అని మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు జీతాలు పెంచి గౌరవించుకున్నామని చెప్పారు.

# ప్రజలకు బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలి

## -డాక్టర్ అబ్దుల్ వసీం క్యూర్ వెల్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో..కార్పొరేటర్ అశోక్ రావు..ముఫ్తి ఘియాస్ మోహియుద్దీన్

కరీంనగర్, అక్టోబర్ 25:నేటినిజం ప్రతినిధి): ప్రజలకు బాధ్యతాయుతంగా మెరుగైన వైద్య సేవలు అందించినపుడే ప్రయివేటు ఆసుపత్రులపై ప్రజలకు అపారమైన నమ్మకం కలుగుతుందని..టిఆర్ఎస్ కార్పొరేటర్ మేచినేని అశోక్ రావు..మజ్లిస్ ఉల్ ఉలేమా అధ్యక్షుడు..హిఫ్జుల్ ఖురాన్ మదర్సా ప్రిన్సిపాల్ ముఫ్తి ఘియాస్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం నగరంలోని మంచిర్యాల చౌరస్తా మజీద్ పక్కన కరోనా స్పెషల్ డాక్టర్ అబ్దుల్ వసీం కు చెందిన క్యూర్ వెల్ హాస్పిటల్ ను ముఫ్తి ఘియాస్ మోహియుద్దీన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రారంభించారు. ఈసందర్భంగా ముఫ్తి ఘియాస్ మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ వసీం కరోనా ఆపత్కాలయంలో ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అలుపెరుగకుండా చేసిన కృషిని జిల్లా..నగర ప్రజలు ఎప్పటికి మర్చిపోరన్నారు. కరోనా మొదటి.. రెండో దశలు ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో కరోనా బారిన పడి ఇంటిలో చికిత్స పొందుతున్న సామాన్య జనాలు రాత్రి.. పగలు తేడా లేకుండా పవిత్ర రంజాన్ మాసంలో ఒక్కపొద్దు రోజాలు క్రమం తప్పకుండా పాటిస్తూ ఫోన్ లో వైద్య సహాయం అందించి..కొంచెం కూడా ఎవరిని నొప్పియ్యకుండా అభిమానంతో వైద్య సహాయం అందించిన మహోన్నత వ్యక్తిత్వం గల డాక్టర్ అబ్దుల్ వసీం అన్నారు. చాలా తక్కువ ఫీజుతో..పేద వాళ్లకు అండగా..మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రజా శ్రేయస్సు కోసం కోవిడ్ వైద్య సేవలు అందించారన్నారు. అబ్దుల్ వసీం లక్షలాది మందికి కరోనా ఆపత్కాలంలో అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు చూరగొని ప్రాణదాతగా నిలిచారన్నారు. ఆయన సేవలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యో నారాయనో హరీ అని పెద్దలు అన్నట్టు వైద్యులు ప్రాణాధాతలని.. వారిని గౌరవించాలన్నారు. ఈకార్యక్రమంలో



తదితరులు పాల్గొన్నారు. జమాతే ఇస్లామి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖైరుద్దీన్, ముఫ్తి యునూస్ ఖాస్మి, ప్రభుత్వ ఆసుపత్రి ఏవో నజీముల్లాహ్ ఖాన్, ముస్లిం జెఎసి జిల్లా అధ్యక్షుడు షేక్ అబూబకార్ ఖాలీద్, నిసారూల్ హాక్, కలీమ్ షరీఫ్, ఖాధిమానే మిల్లత్ కారదర్శి సమద్ నవాబ్.. ఖాజీ ముఖయ్యర్ షా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


డా॥ సి.నారాయణ రెడ్డి గారి ఆశీస్సులతో
భాషా సాంస్కృతిక శాఖ - తెలంగాణ ప్రభుత్వం
సౌజన్యంతో
కవి సంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ, యానాం
నిర్వహణలో
శ్రీ నగ్నముని, శ్రీ సురేంద్ర దేవ్ చెల్లి గార్లకు
శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం
కవిసంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం
శిఖామణి కవితా సర్వస్వం - 3 సంపుటాలు ఆవిష్కరణ
కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి రచన 'కవిత్వ దీపశిఖ' ఆవిష్కరణ
తేది : 30 అక్టోబరు 2021, శనివారం, సా॥ 5.30 గం॥లకు
డా॥ అత్తలూరి నరసింహారావు వేదిక, రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్ & జూమ్ వేదికపై
ముఖ్య అతిథి : పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, కేంద్ర సాహిత్య అకాడమి, మూర్తి దేవి పురస్కృతులు
పూర్వ ఉపాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
అధ్యక్షులు : శ్రీ కె.శివారెడ్డి, సరస్వతీ సమ్మాన్ పురస్కార గ్రహీత, కన్వీనర్, తెలుగు సలహామండలి, సాహిత్య అకాడమి
సభా ప్రారంభకులు : డా॥ మామిడి హరికృష్ణ, సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
విశిష్ట అతిథి : శ్రీ తనికెళ్ల భరణి, ప్రముఖ చలనచిత్ర నటులు, కవి, రచయిత
గౌరవ అతిథులు : డా॥ ఓల్గా, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత
డా॥ కె.శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి సంపాదకులు
డా॥ డి.విజయ్ భాస్కర్, కేంద్ర సంగీత నాటక అకాడెమీ పురస్కార గ్రహీత
శ్రీ కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి, ప్రముఖ కవి, విమర్శకులు
ఉత్సవ ప్రస్తావన : శ్రీ దాట్ల దేవదానం రాజు, కళైమామణి పురస్కార గ్రహీత, కవిసంధ్య ఉపాధ్యక్షులు
ఆత్మీయ అతిథులు : డా॥ ప్రసాద మూర్తి, (శిఖామణి కవితా సర్వస్వం పరిచయం)
డా॥ బెల్లి యాదయ్య, (నగ్నముని కవిత్వ పరిచయం)
డా॥ కోయి కోటేశ్వరరావు, (కవిత్వ దీపశిఖ పరిచయం)
శ్రీ బొల్లోజు బాబా (సురేంద్ర దేవ్ చెల్లి కవిత్వ పరిచయం)
డా॥ వరుగు భాస్కర్ రెడ్డి, (కవిత్వ దీపశిఖ అంకిత స్వీకర్త)
ప్రిన్సిపాల్, డా॥ ఎస్.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యానాం
అవార్డు గ్రహీతల స్పందన : శ్రీ నగ్నముని, శ్రీ సురేంద్ర దేవ్ చెల్లి








Printed, Published and owned by VEENADAS,at
Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.